క్లుప్తంగా

మంత్రి తుమ్మలకు వినతి

తల్లాడ: తల్లాడ సొసైటీలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు తల్లాడ మండల సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కాపా అప్పయ్య వినతిపత్రం అందజేశారు. ఖమ్మంలో మంత్రి తుమ్మలను కలిసి సొసైటీలో జరిగిన అక్రమాలు, అవతకవలపై విచారణ నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

ఎంపీడీఓకు వినతి

తల్లాడ: రోడ్డుపై ప్రయాణించే సమయంలో కళ్లలో దుమ్ము పడుతుందని సామాజిక కార్యకర్త ఎస్.వి.రాఘవులు అన్నారు. నారాయణపురం గ్రామం వెళ్లే ప్రధాన రహదారిలో దుమ్ము లేవడంతో.. వచ్చి వెళ్లే ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని బుధవారం ఎంపీడీఓ చంద్రమౌళి, మేజర్ పంచాయతీ కార్యదర్శి మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. తల్లాడ ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి నారాయణపురం గ్రామం నుంచి రెడ్డిగూడెం ఈ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినా నిర్మాణానికి నోచుకోలేదు. ఈ రోడ్డులో లూర్దుమాతా హైస్కూల్, పరీక్షా కేంద్రాలు ఉన్నాయి.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ పూర్ణయ్య

చింతకాని: మండలంలోని నాగులవంచ రైల్వే కాలనీ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ కోపూరి పూర్ణయ్య బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు రూ.7 లక్షల వ్యయంతో గ్రామంలో సీసీ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ యలమంద, నాయకులు వెంకటేశ్వర్లు, గోవిందరావు, నాగార్జున్ పాల్గొన్నారు.

శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయానికి విరాళాలు

పెనుబల్లి: మండలంలోని వీయంబంజర్ ఎన్ఎస్‌పీ కాలువ పక్కన ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయానికి యలమంచిలి రామచంద్రయ్య రూ.25 వేలు, తాళ్లపెంట గ్రామానికి చెందిన బాబిరెడ్డి రూ. 10,116లు, వియంబంజర్ పైపుల చంటి రూ.5,116లు, లంకాసాగర్ పైపుల చెన్నారావు రూ.5 వేలు విరాళంగా ఆలయంలో నిర్వహించే అర్చనల నిమిత్తం అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ యారం వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యలమంచి రామచంద్రయ్య, జగన్, వెంకటేశ్వరరావు, గంగరాజు, ప్రకాశ్, మహేష్, ఆలయ అర్చకులు సోము నాగేంద్రాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ



సత్తుపల్లిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులకు పెన్నా ఇండస్ట్రీ మేనేజర్ డి.విద్యాసాగర్ రూ.5వేలు వితరణతో నవచైతన్య సంస్థ నిర్వాహకులు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, నవచైతన్య సంస్థ నిర్వాహకులు గాదె నర్సింహారెడ్డి, కిరణ్, అధ్యాపకులు ప్రవీణ్, ప్రసాద్, సంపత్, ఆయూబ్, తిరుమలయ్య పాల్గొన్నారు.

29న హెల్త్ డైరెక్టర్ కార్యాలయం ముట్టడి

తల్లాడ: భద్రాద్రి కొత్తగూడెం డీఎంహెచ్ఓ అక్రమ డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని, హెల్ హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ నాయక్‌పై పెట్టిన కేసులు ఎత్తి వేయాలని ఈ నెల 29న హైదరాబాద్‌లోని హెల్త్ డైరెక్టర్ కార్యాలయాన్ని ముట్టడి చేయనున్నట్లు లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు దశరథ్ నాయక్ అన్నారు. బుధవారం మల్సూర్‌తండాలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు గుగులోత్ కేశవ్ నాయక్, నందు నాయక్, రవినాయక్, రాందాస్ నాయక్, భూపతి నాయక్, పోతురాజు నాయక్, భాను ప్రేమ్‌కుమార్ నాయక్, కృష్ణా నాయక్, చందు నాయక్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం హర్షం

సత్తుపల్లిటౌన్: రాజ్యసభ సభ్యుడిగా వద్దిరాజు రవిచంద్ర ఏకగ్రీవంగా ఎన్నిక కావటం పట్ల సత్తుపల్లి నియోజకవర్గ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు మానుకోట మధు, రామిశెట్టి కృష్ణ, పెద్దిరెడ్డి పురుషోత్తం, నుంకర వాసు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రకటనలో ఎం.శ్రీను, కె.నాగు, రాజేష్ తదితరులు ఉన్నారు.

సాగునీటి కష్టాలు.. తీరేదెన్నడో ?

- విడుదల కానీ సాగర్ జలాలు
- ఎండిపోతున్న పంటలు
- ఆందోళనలో రైతులు



నెర్రలు బారిన వరిపొలం



నీరు లేక ఎండిపోతున్న పెసర

ఏన్కూరు: రైతులకు సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. సాగర్ జలాల ద్వారా మండలంలోని సుమారు 2,150 ఎకరాలకు సాగునీరు అందేది. అందులో 1,200 ఎకరాల్లో వరిసాగు, 800 ఎకరాల్లో మొక్కజొన్న, 150 ఎకరాల్లో పెసరసాగు చేసేవారు. కానీ ఈ ఏడాది సాగర్‌జలాలు వచ్చేది నమ్మకం లేక కొంతమంది రైతులు మాత్రమే సుమారు 350 ఎకరాల్లో వరిసాగు చేశారు. ఆరుతడి పంటలైన పెసర, మొక్కజొన్న యథావిధిగా సాగు చేశారు.

సాగుచేసిన గ్రామాలు..

మండలంలోని ఆరికాయలపాడు, బురదరాఘవాపురం, శ్రీరాంగిరి తిమ్మారావుపేట, ఎర్రబోడు తండ, జన్నారం, మేడేపల్లి గ్రామాల్లో సాగర్ ఆయకట్టు కింద వరి, మొక్కజొన్న, పెసర సాగు చేశారు. ప్రస్తుతం పంటలు చేతికొచ్చే తరుణంలో సాగర్ జలాలు విడుదల చేయకపోవడంతో నీరులేక భూమి నెర్రలు బారుతుంది. పది రోజులు ఇలాగే ఉంటే వరిపంటలన్నీ పశువుల పాలు కావాల్సిందేనని రైతులు ఆవేదన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగునీటిని సరఫరా చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని అన్నదాతలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

సాగర్ జలాలు అందించాలి..



వేసంగిలో సాగర్ ఆయకట్టు కింద ఐదు ఎకరాల్లో వరి సాగు చేశాను. ప్రస్తుతం పంట చిరుపొట్ట దశలో ఉంది. నీరులేక నేల నెర్రలు బారింది. ఇకనైనా సాగర్ జలాలు విడదల చేస్తే పంట చేతికొచ్చే అవకాశం ఉంది. లేదంటే పశువులు మేపుకోవాల్సి వస్తుంది. అధికారులు స్పందించి సాగర్ జలాలు విడుదల చేయాలి.

– బట్టు హనుమంతు రెడ్డి, రైతు, ఆరికాయలపాడు

పంటలు ఎండిపోతున్నాయి..



మండలంలో సాగర్ ఆయకట్టు కింద 350 ఎకరాల్లో వరి సాగు చేయగా.. 250 ఎకరాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పెసర కూడా అలానే ఉంది. ప్రస్తుతం వరి చిరుగంజ దశకు వచ్చింది. నీరు లేక పొలం నెర్రలు బారుతుంది.

– ఆర్ బాలకృష్ణ ఏఈఓ, బురదరాఘవాపురం

ఇక 'నామినేటెడ్' వంతు

- డాక్టర్ దయానంద్, విజయబాబుకు రాష్ట్రస్థాయి పదవులు
- సత్తుపల్లి మార్కెట్ చైర్మన్ నియామకానికి కసరత్తు



మట్టా దయానంద్



ముప్వా విజయబాబు



సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

సత్తుపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ప్రభుత్వ అధికారుల బదిలీలు చేపట్టగా.. ఇప్పుడు నామినేటెడ్ పదవుల వంతు వచ్చింది. గత ప్రభుత్వం నియమించిన నామినేటెడ్ పదవులన్నీ రద్దు కావడంతో ఆయా పదవులపై ఆశావాహుల్లో ఉత్కంఠత నెలకొంది. దశాబ్దకాలంగా కాంగ్రెస్ నేతలు నామినేటెడ్ పదవులకు దూరంగా ఉండగా, ఈసారి ఆశావాహుల సంఖ్య పెద్దగానే ఉంది. ఎన్నికల్లో కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు ఇచ్చేలా పార్టీ నాయకత్వం ఇప్పటికే కసరత్తు పూర్తి చేసినట్టు సమాచారం. పెనుబల్లి మండలం నీలాద్రీశ్వరుడి ఆలయ చైర్మన్‌గా కమ్మ సామాజికవర్గానికి చెందిన చీకటి చిన్న నర్సింహారావును నియమించారు. ఇకపోతే రెండు మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఆత్మకమిటీ చైర్మన్, కందుకూరు దేవస్థానం చైర్మన్ పదవుల భర్తీకి కార్యాచరణ సిద్ధం కాగా.. ఎమ్మెల్యే రాగమయి, దయానంద్ ఎవరికి అవకాశం వస్తారనే అంశంపై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది.

రాష్ట్ర కార్పొరేషన్ పదవులకు..

రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులకు సత్తుపల్లి నియోజకవర్గం నుంచి డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్, ముప్వా విజయబాబు పేర్లు వినిపిస్తున్నాయి. కులధ్రువీకరణ పత్రం వివాదంతో చివరి నిమిషంలో ఎమ్మెల్యే టికెట్ దయానంద్ సతీమణి రాగమయికి దక్కింది. ఇక్కడ 19వేల పైచిలుకు మెజార్టీతో రాగమయి విజయం సాధించడం వెనుక దయానంద్ పదిహేళ్ల శ్రమ ఉండగా, ఎమ్మెల్యేతో పర్యటనల సమయాన ప్రొటోకాల్ సమస్య తలెత్తకుండా దయానంద్‌కు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి లేదా జెడ్పీ చైర్మన్ పదవి ఇవ్వాలనే డిమాండ్ తెరపైకి వస్తోంది. ఇకపోతే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అనుచరుడైన ముప్వా విజయబాబుకు సైతం కార్పొరేషన్ పదవి, ఎమ్మెల్సీ పదవి దక్కుతుందని ప్రచారం జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఎమ్మెల్యే కనకయ్యకు జిల్లాలోనే అత్యధిక మెజార్టీ వచ్చేలా పనిచేయడంతో పాటు సింగరేణి ఎన్నికల్లో సైతం విజయం సమకూర్చిన ఆయన పనితీరుకు పార్టీలో మంచి గుర్తింపు వచ్చింది.

సత్తుపల్లి, కల్లూరు మార్కెట్ కమిటీలకు..

సత్తుపల్లి, కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్ల నియామకంపై ఎమ్మెల్యే రాగమయి సమాలోచనలు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో దయానంద్‌కు అసెంబ్లీ టిక్కెట్ నిరాకరించటంతో ఆయన అనుచరుడైన మలిరెడ్డి మురళీరెడ్డి సతీమణి కిరణ్మయికి సత్తుపల్లి మార్కెట్ పదవి ఇచ్చారు. ఏడాది తర్వాత ఆమె పదవీ కాలం పొడిగించలేదు. అప్పటి నుంచి మార్కెట్ పదవిపై పలువురు ఆశలు పెంచుకున్నా భర్తీకి నోచుకోలేదు. చైర్మన్ పదవి జనరల్ నుంచి ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ అయినా కమిటీని నియమించకపోవడంతో పాలకవర్గం లేకుండానే సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కొనసాగింది. ఇప్పుడు చైర్మన్‌గా దోమ ఆనంద్, ఐ.శ్రీనివాసరావుతో పాటు మరి కొందరి పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇకపోతే కల్లూరు మార్కెట్ చైర్మన్ పదవి జనరల్ మహిళకు రిజర్వ్ అయిన నేపథ్యాన పలువురు పోటీపడుతున్నారు. ఇప్పటి వరకు పెనుబల్లి మండలానికే ప్రాధాన్యత ఇస్తుండగా, ఈసారి కల్లూరుకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ మరికొందరు సూచిస్తున్నారు.

సంత్ సేవాలాల్ మార్గం అనుసరణీయం



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్, తదితరులు

కారేపల్లి: బంజారుల ఆరాధ్యుడు, సద్గురు సంత్ సేవాలాల్ మార్గం అనుసరణీయమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. బుధవారం కారేపల్లి వైఎస్ఎన్ గార్డెన్‌లో సేవాలాల్ ఉత్సవ కమిటీ కన్వీనర్ వాంకుడోత్ గోపాల్‌నాయక్ అధ్యక్షతన జరిగిన పూజా కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పాల్గొని పూజలు చేసి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రం కారేపల్లిలో సంత్ సేవాలాల్ ఆలయ నిర్మాణానికి కావాల్సిన ప్రభుత్వ స్థలాన్ని అధికారుల, ప్రజాప్రతినిధుల, మండల ప్రజల సహకారంతో కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు బంజార సోదరీమణులు బిందెలను నెత్తిన పెట్టుకొని లంబాడ సంస్కృతి సాంప్రదాయాలతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కారేపల్లి అంబేడ్కర్ సెంటర్ నుంచి సినిమాహాల్ సెంటర్ మీదుగా వైఎస్ఎన్ గార్డెన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జగన్, తహశీల్దార్ సంపత్ కుమార్, ఎంపీడీఓ సురేందర్, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు గోపాల్ నాయక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మంజుల, గిరిజన సంఘం నాయకులు వీరభద్రంనాయక్, మండల అధ్యక్షులు చంద్రప్రకాశ్, రామ్మూర్తి, బాలునాయక్, సొసైటీ డైరెక్టర్ హీరాలాల్, ఎంపీటీసీ ఈశ్వరీనందరాజ్, భీముడు, లంబాడీ సంస్కృతి సంక్షేమ సమితి అధ్యక్షులు రాములు, నరేష్, హేమ్లానాయక్, వీరూనాయక్, టోనీవీరప్రతాప్, రమేష్, ఠాగూర్, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఆదెర్ల స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



సత్తుపల్లిటౌన్: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

మధిర/సత్తుపల్లిటౌన్: ఈ నెల 24న ఖమ్మంలో జరగనున్న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కన్వీనర్ ఓరుగంటి శేషగిరిరావు పిలుపు నిచ్చారు. బుధవారం మధిర, సత్తుపల్లి కోర్టుల్లో ఐఏఎల్ నాయకులతో కలిసి న్యాయవాదులు పోస్టర్లు ఆవిష్కరించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం పక్కన ఉన్న డీపీఆర్‌సీ భవనంలో జిల్లా మహాసభలతో పాటు 75 సంవత్సరాల ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ పాత్ర అనే అంశంపై రిటైర్డ్ హైకోర్టు జడ్జి బి.చంద్రకుమార్‌తో పాటు పలువురు న్యాయమూర్తులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం జరిగే జిల్లా మహాసభల్లో ప్రస్తుతం న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. న్యాయవాదులు అందరూ ఈ మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, కావూరి రమేష్, వాసంశెట్టి కోటేశ్వరరావు, నంబూరు జనార్ధన్ రావు, నెల్లూరు రవి, బోజడ్ల పుల్లారావు, తూములూరి సుచరిత, షేక్ లతీఫ్, మేకల నవీన్ కుమార్, శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలపాటి శ్రీనివాసరావు, బొర్రా వెంకట్రావ్, హిమావలీ, అజయ్‌కుమార్, అరుణకుమారి, నరేష్ పాల్గొన్నారు.

భట్టికి న్యాయవాదుల కృతజ్ఞతలు



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లారావు

మధిర: మధిరలో కోర్టు భవన సముదాయ నిర్మాణానికి డిప్యూటీ సీఎం ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క రూ.24 కోట్ల నిధులు మంజూరు చేయడంపై న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ హాల్‌లో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో అధ్యక్షుడు బోజడ్ల పుల్లారావు మాట్లాడారు. పాత కోర్టు భవనాలను పరిశీలించిన భట్టి, ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. అలాగే, నూతన భవనాలు నిర్మించే వరకు ఇటీవల మంజూరైన సబ్ కోర్టును సమీకృత రైతు బజార్ భవనంలో నిర్వహించేలా అనుమతి ఇప్పించాలని కోరారు. న్యాయవాదులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, చావలి రామరాజు, తూములూరి కృష్ణారావు, కట్టా పూర్ణచందర్ రావు, దేవరపల్లి సుబ్రహ్మణ్యం, చింతల గోపాల్, రమేష్, నెల్లూరు రవి, భైరవబొట్ల శ్రీనివాసరావు, అవ్వా విజయలక్ష్మి, పల్లపోతుల కృష్ణారావు, విజయ్‌కుమార్, కోట జ్ఞానేష్, సతీష్, గంధం శ్రీనివాసరావు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మధిరరూరల్: మండలంలోని సిరిపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఈ నెల 22న మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా సిరిపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ మధిర రూరల్ ఏఈ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరిపురం, మల్లవరం, జాలిముడి, రామచంద్రాపురం గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

దిమ్మెపై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



దిమ్మెపై ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణ శివారులో నేలపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎట్టకేలకు విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి దిమ్మెపై ఏర్పాటు చేశారు. ఈ నెల 18వ తేదీన 'సాక్షి'లో 'నిర్లక్ష్యానికి నిదర్శనంగా ట్రాన్స్‌ఫార్మర్' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం స్పందించి రక్షణ చర్యలు చేపట్టినట్లు ఏఈ శరత్‌బాబు తెలిపారు.

టీబీ వ్యాధిపై అవగాహన



మిట్టపల్లిలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి గ్రామంలో బుధవారం టీబీవ్యాధిపై తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీబీవ్యాధి లక్షణాలున్న వారి కళ్లె నమూనాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో టీబీ చికిత్స సూపర్‌వైజర్ వై.సురేష్, సంజయ్‌కుమార్, ఎఎన్ఎం పద్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ దీపికలకు శిక్షణ కార్యక్రమం



మాట్లాడుతున్న డీపీఎం శ్రీనివాసరావు

కల్లూరు: కల్లూరు ఉషోదయ మండల మహిళా సమాఖ్య స్త్రీ శక్తి భవన్‌లో బుధవారం తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా ప్రభుత్వం చైతన్యం సంక్షేమ అభివృద్ధి పథకాలపై గ్రామ దీపికలకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సెర్ప్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ దొడ్డా శ్రీనివాసరావు, ఏపీఎం ఎం.వెంకట్రామారావు పాల్గొని మాట్లాడారు. లక్పతి దీది, లోకోస్ యాప్ పై అవగాహన కల్పించారు. లక్పతి దీది పథకాన్ని ప్రతీ గ్రామ సమాఖ్య నుంచి గ్రామ దీపిక పరిధిలో అర్హులైన వ్యవసాయ మరియు వ్యవసాయేతర రంగాల్లో వారు ఎంచుకున్న ఉపాధిని అనుసరించి వచ్చే ఏప్రిల్ నుంచి అమలు చేయాలన్నారు. ఈ పథకాలకు మండలంలోని అన్ని స్వయం సహాయక సంఘాల లీడర్లు, సభ్యులు తమయొక్క బ్యాంక్ ఎకౌంట్, ఆధార్, ఇన్సూరెన్స్ పథకాలు నమోదు చేసుకోని కేంద్ర, రాష్ట్ర పథకాలకు అర్హత పొందాలన్నారు. కార్యక్రమంలో శ్రీనిధి మేనేజర్ చారి, సీసీలు పి.వెంకటేశ్వర్లు, ఎస్‌కే ఫాతీమా, వెంకటరావమ్మ, సీహెచ్ శ్యామలాదేవి, రాధా రుక్మిణి, ఎస్తేరు, అకౌంటెంట్ అపర్ణ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



ఎర్రుపాలెం గురుకులంలో బాలికకు బహుమతి అందజేస్తున్న ఆర్‌సీఓ ప్రత్యూష

ఎర్రుపాలెం: గురుకులాల విద్యార్థులు చదువులో రాణించి మెరుగైన ఫలితాలు సాధించాలని గురుకుల పాఠశాలల రీజనల్ కోఆర్డినేటర్ ప్రత్యూష అన్నారు. బుధవారం మండలంలోని గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఫేర్‌వెల్‌డే వేడుకలో ఆమె పాల్గొని ప్రతిభ చూపిన బాలికలకు బహుమతులు అందించారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పద్మావతి, పేరెంట్స్ కమిటీ సభ్యులు చిట్టిబాబు, బాబురావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బనిగండ్లపాడు జూనియర్ కళాశాలలో..

మండలంలోని బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఫేర్‌వెల్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రమణారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, సొసైటీ చైర్మన్ అక్కిరెడ్డి, మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలి



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు వసంత

చింతకాని: దివ్యాంగ పిల్లల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలని ఫిజియోథెరపిస్ట్ వల్లూరి వసంత తెలిపారు. మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో బుధవారం ప్రత్యేక అవసరాలు కల్గిన దివ్యాంగులకు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో పాక్షిక పక్షవాతం, ఇతర శారీరక అంగవైకల్యం కల్గిన పిల్లలకు ఉచితంగా ప్రత్యేకంగా ఫిజియోథెరపీ సేవలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సేవలతో పిల్లల్లో శారీరక, మానసిక పరిపక్వత కనబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, భవిత కేంద్రం సంరక్షురాలు అరికొట్ల లలితకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ భాష అమృతం..

ఘనంగా ప్రపంచ మాతృభాషా దినోత్సవం



మధిర: మాట్లాడుతున్న రవికుమార్

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ శీలం ఇందిర ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. మాతృభాష గొప్పతనాన్ని, ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.రవికుమార్, అర్థశాస్త్ర అధ్యాపకురాలు జి.అరుణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుజాత, హిస్టరీ అధ్యాపకుడు పి.వీరన్న పాల్గొన్నారు.

చింతకాని: మండలంలోని నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయంలో నిర్వహించిన మాతృభాష దినోత్సవ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ కిరణ్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, తెలుగు ఉపాధ్యాయులు రేణుక, ఉపాధ్యాయులు గోపి, వినిల, కిరణ్, పార్వతి, భీమల్, శ్రీనివాస్, సుజాత, రాధా, త్రివేణి, రాశి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాతృభాష వేడుకల సందర్భంగా విద్యార్థులు, వివిధ కవులచే రూపొందించి తాళ పత్రాలను తయారు చేసి అలరించారు. విద్యార్థులచే బుర్ర కథలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సుచరిత, నరసింహారావు, మురళీకృష్ణ, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

కుమారుల సంతకం అడుగుతున్నారు..

వేంసూరు: భర్త పేరిట తీసుకున్న రుణం మొత్తాన్ని చెల్లించినా కొడుకుల సంతకం ఉంటేనే బ్యాంకు అధికారులు బంగారం ఇస్తామంటున్నారని వేంసూరుకు చెందిన బొంతు సత్యవతి ఆరోపించింది. ఈ సందర్భంగా బుధవారం ఆమె వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బొంతు సత్యనారాయణ వేంసూరు యూనియన్ బ్యాంక్‌లో బంగారు తాకట్టు పెట్టి రుణం తీసుకోగా, రెండేళ్ల క్రితం ఆయన మృతి చెందాడు. దీంతో సత్యనారాయణ భార్య సత్యవతి రుణం మొత్తాన్ని చెల్లించినా, నామినీగా ఉన్న తనను కాదని ముగ్గురు కొడుకులు వచ్చి సంతకం చేస్తే బంగారం ఇస్తామని బ్యాంకు అధికారులు ఇబ్బంది పెడుతున్నారని వాపోయింది. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించాలని ఆమె కోరింది.

బ్రిలియంట్ ఒలంపియాడ్‌లో విద్యార్థి ప్రతిభ

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని జ్యోతినిలయం పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న పి.నైసి ఇటీవల ఖమ్మంలో జరిగిన ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్‌లో క్రియేటీవ్ పెయింటింగ్ విభాగంలో జిల్లా టాపర్‌గా నిలిచింది. నైసికి ఐబీఓ సంస్థ ఆధ్వర్యంలో రమేష్‌బాబు, వెంకటరెడ్డి, జోయల్ డేనియల్ చేతుల మీదుగా బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బాలికను అభినందించారు.